క్లుప్తంగా

అభిమానులకు ధన్యవాదాలు

గార: శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మాన ప్రసాదరావు బుధవారం ఉదయం నామినేషన్ వేసేందుకు వచ్చి మద్దతు పలికిన గార మండల అభిమానులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీస గోపి, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి హాజరైన వారందరికీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ, యువజన విభాగం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా


రాజీనామా చేసిన వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయం లక్ష్యంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. వీరిని సర్పంచ్ బల్లాడ ఇందుమతి, ఎంపీటీసీ బల్లాడ జనార్దనరెడ్డి అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సంస్థ, ఎంజేఎంసీ సంయుక్తంగా బుధవారం 'ఓటరు విద్య' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా క్షేత్ర ప్రచార అధికారి బి.తారకప్రసాద్ పర్యవేక్షించారు. కాగా, వర్సిటీలో గురువారం ఓటు హక్కు ప్రాధాన్యతపై ర్యాలీ, చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తారు.

శివానీ కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు


ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందిస్తున్న యాజమాన్య సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ గ్రూప్ ఆఫ్ కళాశాలలకు విద్యలో అందిస్తున్న సేవలకు గాను భరత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డును బ్రెయిన్ ఓ విజన్ సంస్థ అందజేసింది. విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అవార్డును స్వీకరించారు. కళాశాలలో బుధవారం యాజమాన్య సభ్యులు దుర్గాప్రసాద్‌రాజు ప్రిన్సిపాల్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా అష్టోత్తర శత దీపారాధన


విజయగణపతికి దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో బుధవారం అష్టోత్తర శత దీపారాధన నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ


హాజరైన అధ్యాపకులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని శ్రీచైతన్య స్కూల్‌లో బుధవారం అధ్యాపకులు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్, శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్లు బింధుమాదవి, తిరుపతి లక్ష్మీ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జన నీరాజనం

- ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల మీదుగా కొనసాగిన మేంసిద్ధం బస్సు యాత్ర
- సీఎం జగన్ చూసేందుకు భారీగా హాజరైన కార్యకర్తలు, అభిమానులు


ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌ను పరిచయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/ఎచ్చెర్ల/జి.సిగడాం/శ్రీకాకుళం పాతబస్టాండ్/గార: ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గంలో రెండో రోజు బుధవారం అశేష జనవాహిని మధ్య కొనసాగింది. మంగళవారం రాత్రి యాత్ర ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రవేశించగా అరిణాంఅక్కివలస సమీపంలో రాత్రి బస చేసిన సంగతి తెలిసిందే. బస చేసిన ప్రాంతానికి ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. బస్సుపై ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అరిణాం అక్కివలస కూడలి నుంచి అల్లినగరం కూడలి వరకు ప్రజలు అధిక సంఖ్యలో చేరుకోవడంతో జాతీయ రహదారి జన సంద్రంగా మారింది. ఎండను సైతం లెక్క చేయకుండా ప్రజలు పోటెత్తారు. కుశాలపురం, సింహద్వారం కూడళ్లు మీదుగా శ్రీకాకుళం పట్టణంలోకి యాత్ర ప్రవేశించింది. కొత్తరోడ్డు వద్దకు శ్రీకాకుళం, గార, పొందూరు, ఆమదాలవలస మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు వచ్చారు. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఆమదాలవలస నాయకులు తమ్మినేని చిరంజీవినాగ్, గురుగుబెల్లి నీలారావు, దువ్వాడ రాము, బెండి శారద, మోహనరావు, తమ్మినేని శ్రీనివాసరావు, ఎం.ప్రసాద్, శ్రీకాకుళం నగరానికి చెందిన శ్రీనివాస పట్నాయక్, ఎం.కామేశ్వరి, జి.జ్యోతి, బి.గోపాలరావు, గురుగుబెల్లి గిరి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జగనన్నే అండ

రణస్థలం: దివ్యాంగులకు సంక్షేమ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించడంతో ఎంతో సంతోషకరమని విజయనగరం వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కొండబాబు తెలిపారు. ఎచ్చెర్ల మండలంలోని అల్లినగరంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రాంగణానికి విజయనగరం నుంచి పలువురు దివ్యాంగులు వచ్చారు. గతంలో ఉద్యోగావకాశాల్లో తమకు ఉన్న 3 శాతం రిజర్వేషన్ను 4శాతం చేశారని, అలాగే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు మజ్జి సత్యనారాయణ, యలమల రామాయమ్మ తో పాటు పలువురు ఉన్నారు.


బస్సు యాత్ర సభా ప్రాంగణానికి విచ్చేసిన విజయనగరం జిల్లా దివ్యాంగులు


సీఎం జగన్‌తో ఎన్ని ధనుంజయ్


సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో అభిమానులు


ముఖ్యమంత్రిని చూసేందుకు భారీగా తరలివచ్చిన జనం


బస్సు ఎక్కిన అభిమానులు

విజయం మనదే

- నామినేషన్ ర్యాలీలో మంత్రి ధర్మాన
- 80 ఫీట్ రోడ్డులో భారీ ర్యాలీ


నామినేషన్ వేసేందుకు వెళ్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మీ అభిమానం చూస్తే ఈసారి వైఎస్సార్ సీపీ గెలుపు ఏకపక్షం ఖాయమేనని మంత్రి ధర్మాన ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి ధర్మాన ప్రసాదరావు బుధవారం నామినేషన్ దాఖలు పర్చారు. ముందుగా పెద్దపాడు అప్పన్నమ్మ తల్లిని దర్శించుకుని అక్కడి నుంచి భారీ ర్యాలీగా అరసవల్లి కూడలికి చేరుకున్నారు. అక్కడి నుంచి 80 అడుగుల రోడ్డులో మేళతాళాలు, పులివేషాలు, అశేష జనసందోహం నడుమ వాంబే కాలనీ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం మంత్రి ధర్మాన ప్రసాదరావు తన నామినేషన్ పత్రాలను శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీహెచ్ రంగయ్యకు అందజేశారు.

పేదల బతుకులు మార్చిన వైఎస్సార్‌సీపీ..

నామినేషన్‌కు ముందు మంత్రి ధర్మాన అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పేద, బడుగు, బలహీనవర్గాలకు అనేక ప్రయోజనాలు కలిగాయన్నారు. ఎంతోమంది పేదల బతుకులు మెరుగుపడ్డాయని తెలిపారు. టీడీపీ పాలనలో ధనవంతులకు కొమ్ముకాస్తూ అవినీతికి సహకరిస్తూ రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు ఎప్పుడూ వ్యతిరేకమేనని చెప్పారు. మన ప్రాంత అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరితపిస్తున్నారని, దీనిలో భాగమే విశాఖలో పరిపాలన రాజధాని నిర్మాణమని తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 20 వేల ఇళ్ల స్థలాల పంపిణీకి భూమిని కొనుగోలు చేసి అందించామన్నారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, రిమ్స్, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి వంటి అనేక శాశ్వత అభివృద్ధి పనులు చేశామన్నారు. అభివృద్ధి జరగలేదని చంద్రబాబు చెబుతున్నారని, తాము చెప్పిన కార్యక్రమాల్లో ఒక్కటైనా 2014 నుంచి 19 వరకు చేయగలిగారా అని ప్రశ్నించారు. మే 13న జరగనున్న ఎన్నికలో ఎంపీగా పేరాడ తిలక్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, గొండు కృష్ణమూర్తి, ఎం.వి పద్మావతి, స్వరూప్, శిమ్మ రాజశేఖర్, పొన్నాడ రుషి, సాధు వైకుంఠరావు, చిట్టి జనార్ధనరావు, పీస గోపి, అంబటి శ్రీనివాసరావు, మూకళ్ళ తాతబాబు, చల్ల శ్రీనివాసరావు, ఎం.ఏ రఫీ, సిరాజుద్దీన్, పీస శ్రీహరి, చల్ల రవి, టి.కామేశ్వరి, వై.గాయత్రి, నల్లి ఆశాదీపికలతో పాటు 50 డివిజన్ల ఇన్‌చార్జ్‌లు, నియోజకవర్గంలో ప్రజలు భారీగా హాజరయ్యారు. భారీ జెండాలతో చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పులి వేషాలతో ఆకట్టుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా దారిపొడువునా మజ్జిగ, మంచినీటిని అందుబాటులో ఉంచారు.


జన సంద్రంలా 80 అడుగుల రోడ్డు


అప్పన్నమ్మతల్లికి పూజలు చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం


నామినేషన్ ర్యాలీలో మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

- జై జగన్, జై కిరణ్ నినాదాలతో హోరెత్తిన జాతీయ రహదారి

రణస్థలం/జి.సిగడాం: ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ అభ్యర్థిగా బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఎచ్చెర్ల మండలంలోని అరిణాం అక్కివలస గ్రామ సమీపంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేం సిద్ధం సభా ప్రాంగణం నుంచి మొదలైన కోలాహలం రణస్థలం తహసీల్దార్ మండల కేంద్రం వరకు కొనసాగింది. సీఎం జగన్ ఆశీర్వాదంతో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి రణస్థలం ఆర్వో కార్యాలయంలో పత్రాలు దాఖలు చేశారు. జాతీయ రహదారి పొడవునా అభిమానులు వేలాదిగా బారులు తీరారు. జై జగన్.. జై కిరణ్ నినాదాలతో హోరెత్తించారు. యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ప్రచారం రథంపై ఎమ్మెల్యే కిరణ్ కుమార్, సతీమణి గొర్లె పరిమళ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. సుమారు నలభై వేలమంది అభిమానులు, పార్టీ శ్రేణులు వెంట రాగా మధ్యాహ్నం 1.35 గంటల సమయంలో కిరణ్‌కుమార్, పరిమళ నామినేషన్ పత్రాలను ఆర్వో ఎస్.వి.లక్ష్మణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నింటి సాయి కుమార్, టొంపల సీతారాం, రొక్కం బాలకృష్ణ, బల్లాడ జనార్దన్ రెడ్డి, హేమామాలిని రెడ్డి, జరుగుళ్ల శంకరరావు, సనపల నారాయణరావు, మీసాల వెంకటరమణ, కాయల వెంకటరమణ, పిన్నింటి రజినీ, గురాన మానస, మహంతి పెదరామినాయుడు, దన్నాన రాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.


దవళపేట నుంచి బయలుదేరిన కార్యర్తలు


బాతువ నుంచి ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు


ముషినివలస నుంచి భారీగా తరలివెళ్లిన అభిమానులు

దేవీ ఆశ్రమంలో భారీ చోరీ

- 30 తులాల బంగారం.. రూ.30 లక్షల నగదు చోరీ!
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఎచ్చెర్ల మండలం దోమాం పంచాయతీ కొంచాలకూర్మయ్యపేట దేవీపీఠంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ.30 లక్షల నగదు, 30 తులాల బంగారం అపహరణకు గురైనట్లు భావిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం దేవీపీఠంలో కోటి లింగార్చన ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటలవరకు పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. మళ్లీ అర్ధరాత్రి 3.30 గంటలకు(బుధవారం వేకువజాము) ప్రత్యేక పూజల కోసం ఆలయం తెరిచేందుకు వేద పండితులు వెళ్లగా గ్రిల్స్, ప్రధాన ద్వారం తలుపులు తాళాలు, గడియలు విరగ్గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా మూడు హుండీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక హుండీ తెరిచి కానుకలు పట్టుకుపోగా, మిగతా రెండు హుండీలు సైతం కనిపించలేదు. ఆలయ యాజమాన్యం సమాచారం మేరకు 30 తులాల అమ్మవారి ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించడంతో ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. వంద తులాలు వెండి, ప్రత్యేక పూజల కోసం సేకరించిన విరాళాలు రూ.30 లక్షలు వరకు చోరీకి గురైనట్లు చెబుతున్నారు. చోరీ నష్టంపై స్పష్టత లేదని, సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. విషయం తెలుసుకున్న క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. ఆలయంలో సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ సైతం దుండగులు పట్టుకుపోయారు. ప్రస్తుతం ఆలయం పరిసర ప్రాంతాల ఇళ్లల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్నక్లూస్ టీం


వాకలవలసలో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన గజలక్ష్మి

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి అన్నారు. బుధవారం వాకలవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ మాయమాటలను నమ్మవద్దన్నారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి ఆరాధన దినోత్సవం


పెద్దమందిరంలో సత్యసాయిబాబా విగ్రహానికి పూలమాల వేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు సత్యసాయి మందిరాలలో సత్యసాయి బాబా ఆరాధనా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్దమందిరంలో ఉచితంగా టోపీలు, గొడుగులు, చలివేంద్రం, 200మందికి అన్నప్రసాదం, 65 మందికి క్యారేజీలతో భోజనాల సేవలు అందిస్తున్నట్లు మందిర కన్వీనర్ కంబ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కో–ఆర్డినేటర్ సూర రామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ నరసింహమూర్తి, యూత్ కో–ఆర్డినేటర్ గ్రాండ్ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు. బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనంలో స్వామి పల్లకీసేవ, రుద్రాభిషేకాలు, రిక్షా కార్మికులకు పాదరక్షలు, వస్త్రదానం చేశామని, 100గంటల అఖండ భజన జరిగిందని మందిర కన్వీనర్ ప్రసాద్ తెలిపారు.